మాట్లాడుతున్న మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ తదితరులు

ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలి

- తెలంగాణ మాదిగ మహాకూటమి డిమాండ్

కాచిగూడ, ఫిబ్రవరి 5: ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలని తెలంగాణ మాదిగ మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు, ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం సూచించిన విధంగా క్రిమిలేయర్‌ను అమలు చేయాలని సూచించారు. క్రిమిలేయర్‌పై తెలంగాణ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేని పక్షంలో ఈ నెల 18న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు హెచ్చరించారు.

ఓయూలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- వర్గీకరణ బిల్లు ఆపాలని డిమాండ్

అచ్చంపేట రూరల్/ చంద్రుగొండ, ఫిబ్రవరి 5 : ఎస్సీల వర్గీకరణను నిరసిస్తూ మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. శాసన మండలిలో వర్గీకరణ బిల్లు ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఏకపక్షంగా తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఓయూలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణ తీరు సరిగా లేదని తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ నేత మాదాసు రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి తడిగుడ్డతో తమ గొంతు కోశారని మండిపడ్డారు. గతంలో మాలలకు ఉన్న ఆరు శాతం రిజర్వేషన్లను ఐదు శాతానికి కుదించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఎస్సీ ఉపకులాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర

- 11 శాతం రిజర్వేషన్ దక్కేదాకా పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హెచ్చరిక
- సుప్రీంకోర్టు తీర్పే కాంగ్రెస్ మెడలు వంచింది
- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం

మీడియాతో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి, నరేందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే, సీఎం రేవంత్‌రెడ్డి ఉపకులాల మధ్య చిచ్చు రగిలించేందుకు యత్నిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ తలపెట్టిన "లక్ష డప్పులు-వేయి గొంతుకలు" కార్యక్రమానికి వాయిదా వేయించడంలో రేవంత్ సర్కార్ సఫలమైందని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి, నరేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గ్రూప్‌లవారీగా కులాలను ఎంపిక చేసినందున మాదిగలు సంబురాలు చేసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణకు సాధికారత వచ్చినా రేవంత్ సర్కారు చర్యలతో ఎదిగిన కులాలకే న్యాయం జరిగిందని మండిపడ్డారు. మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేదాకా పోరాడుతామని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ ఎప్పుడూ మాదిగలకు వ్యతిరేకమే: ఎర్రోళ్ల శ్రీనివాస్

కాంగ్రెస్ ఎప్పుడూ మాదిగలకు వ్యతిరేకమేనని, సుప్రీంకోర్టు తీర్పే కాంగ్రెస్ మెడలు వంచిందని ఎర్రోళ్ల శ్రీనివాస్ చెప్పారు. యూపీఏ ప్రభుత్వం ఉన్నపుడు ఎస్సీ వర్గీకరణ కోసం రాజ్యాంగ సవరణ ఎందుకు చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంబరాలు చేసుకోవడంలో అర్థం లేదని విమర్శించారు. బీజేపీ కూడా పదేండ్లు ఎస్సీలను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికలకు కూడా ఎస్సీ వర్గీకరణ పాటించాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టులు, పథకాల్లో ఎస్సీ వర్గీకరణను పాటించాలని కోరారు. కేసీఆర్ హయాంలో ఎస్సీలకు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ క్రెడిట్ అంతా మందకృష్ణ మాదిగకు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.

మమ్మల్ని గ్రూప్-1లో కలపండి

హోలియా దాసరి సంక్షేమ సంఘం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 : సంచార జీవితాలను గడుపుతున్న హోలియా దాసరులను గ్రూప్-3లో కలపడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమని రాష్ట్ర హోలియా దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తంటం జహంగీర్ మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు లక్ష వరకు హోలియా దాసరుల జనాభా ఉంటుందని, నేటికీ పిన్నీసులు, కాంటాలు, వెంట్రుకలు, వీధి బాగోతాలు ఆడుతూ సంచార జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. 20 శాతం మందికి కుల సర్టిఫికెట్లు కూడా లేవని పేర్కొన్నారు. తమను సంపన్నులు ఉండే గ్రూప్-3లో చేర్చటం బాధాకరమని, ప్రభుత్వం పునఃసమీక్షించి గ్రూప్-1లో కలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రావుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆరెళ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, పక్కన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బొమ్మెర రామ్మూర్తి

మూడు గ్రూపులుగా ఎలా నిర్ణయించారు?

- ఖర్గే, కొప్పుల రాజు, భట్టి, వివేక్ లాబీకి లొంగిన రేవంత్‌రెడ్డి
- మాలలకు కొమ్ముకాస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం: రాజయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఏ నిబంధన ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేశారో? ఆయా కులాలను 3 గ్రూపులుగా ఎలా నిర్ణయించారో? రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. అభివృద్ధి చెందిన కొన్ని కులాలను గ్రూప్-1లో ఎలా చేర్చారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, ఎన్నో ఏండ్లుగా కులవివక్ష అనుభవిస్తున్న మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బుధవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బొమ్మెర రామ్మూర్తితో కలిసి మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పెట్టిందని చెప్పారు. మంద కృష్ణ మాదిగ 30 ఏండ్లు రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాడారని, ఈ క్రమంలో చాలా మంది అమరులయ్యారని గుర్తుచేశారు. మాదిగలు 3.5 లక్షలు, మాలలు 1.5 లక్షల మంది ఉన్నారని, జనాభా వెనుకబాటు బట్టి రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. జనాభా ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ క్యాటగిరీల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హస్తం ఉన్నదని ఆరోపించారు. ఖర్గే, కొప్పుల రాజు, భట్టి, వివేక్ వెంకటస్వామి లాబీయింగ్‌కు రేవంత్‌రెడ్డి లొంగారని, అందుకే మాలలకు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి నినాదాలు చేస్తున్న వంగపల్లి తదితరులు

వర్గీకరణ తీర్మానం ఘనత కేసీఆర్‌దే

- ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి
- ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి

కవాడిగూడ, ఫిబ్రవరి 5 : 2014 అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ తీర్మానం చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఏకగ్రీవంగా వర్గీకరణ తీర్మానం చేసిన కేసీఆర్.. స్వయంగా ప్రధాని మోదీని కలిసి ఎస్సీ వర్గీకరణ కావాలని విజ్ఞప్తిచేసినట్టు గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో.. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు యాతాకుల భాస్కర్‌తో కలిసి బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వంగపల్లి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు అసెంబ్లీలో తీర్మానం చేయడంతోపాటు వర్గీకరణ కోసం పార్లమెంటు సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేసినట్టు గుర్తుచేశారు. మంగళవారం అసెంబ్లీలో వర్గీకరణ చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్, కవితకు వంగపల్లి అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతిఒక్క మాదిగ బిడ్డదని పేర్కొన్నారు. ఈ విజయాన్ని అమరవీరులకు అంకితమిస్తున్నట్టు ప్రకటించారు. మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. మాదిగలు, ఉపకులాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ దండోరా ఉద్యమంలో ఎంతో మందిపై కేసులు నమోదయ్యాయని, వాటిని తక్షణమే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో వర్గీకరణ తీర్మానం ఆమోదించిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. వర్గీకరణతోనే మాదిగలకు రాజ్యాధికారం దక్కుతుందని, మాలలు కలిసివస్తే సమిష్టిగా అభివృద్ధి చెందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు మధు, శ్రీనివాస్, రమేశ్, కృష్ణ, సంజీవ, యాకయ్య, యాదగిరి, జిల్లాల అధ్యక్షులు శాంతికిరణ్, సాగరం, నరేందర్, రాజేందర్, గంగాధర్, నరేశ్, రాజన్న, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

యూజీసీ డ్రాఫ్ట్ రూల్స్ ఉపసంహరించుకోవాలి

- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు, ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన డ్రాఫ్ట్ రూల్స్‌ను తక్షణమే యూజీసీ ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. యూజీసీ నిబంధనలపై బీజేపీయేతర పాలిత రాష్ట్ర మంత్రులు బుధవారం బెంగళూరులో సమావేశమై చర్చించారు. రాష్ట్రం తరపున హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో యూజీసీ సంప్రదింపులు జరపాలని తెలిపారు. నిబంధనలు రాష్ట్రాల హక్కులను హరించేలా ఉన్నాయని, వర్సిటీల్లో యూజీసీ జోక్యాన్ని సహించబోమని సమావేశంలో తీర్మానించారు.

వర్గీకరణలో మాదిగలకు అన్యాయం

- అభివృద్ధి చెందిన ఎస్సీ కులాలకే మళ్లీ పట్టం కట్టారు
- మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే
- రిజర్వేషన్లు తగ్గుతాయని సీఎంకు ముందే తెలుసు
- మంత్రి దామోదర రాజనర్సింహను బర్తరఫ్ చేయాలి
- మాదిగల ప్రయోజనాలు దెబ్బ సేందుకు వివేక్ కుట్ర
- పంబాల కులాన్ని ఎస్సీ-ఏ గ్రూప్‌లో ఎలా చేర్చారు?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మందకృష్ణ మాదిగ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మండిపడ్డారు. ఇష్టారాజ్య వర్గీకరణతో తమకు న్యాయమైన వాటా దక్కలేదని తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మంద కృష్ణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఈ లెక్కన 32 లక్షల మంది ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాల్సి ఉన్నా ఉద్దేశపూర్వకంగానే తమకు దక్కకుండా చేశారని ఆరోపించారు. మాదిగలకు జనాభా నిష్పత్తి కన్నా రిజర్వేషన్లు తక్కువ వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డికి ముందే తెలుసని విమర్శించారు. వర్గీకరణలో లోపాలతో వెనుకబడిన కులాల గ్రూప్‌లోకి అభివృద్ధి చెందిన కులాలు వచ్చాయని ఆరోపించారు.

పంబాల కులాన్ని ఎలా చేర్చారు?

అత్యంత వెనుకబడిన ఎస్సీ 'ఏ' గ్రూప్‌లో పంబాల కులానికి చెందిన ఘంటా చక్రపాణి లాంటి వాళ్లను ఎలా చేర్చారని మందకృష్ణ ప్రశ్నించారు. ఆయన ఇంట్లోనే ముగ్గురు, నలుగురు ప్రొఫెసర్లు ఉన్నారని తెలిపారు. వాళ్ల జనాభా వెయి ఉంటే వంద మంది వరకు ఉద్యోగస్తులు ఉన్నారని చెప్పారు. అంటే పది కుటుంబాలకు ఒక్క ఉద్యోగం ఉన్నదని ఉదహరించారు. అదే గ్రూప్‌లో ఉన్న తక్కల కులంలో 2,558 జనాభా ఉన్నా ఒక్క ఉద్యోగం అయినా ఉన్నదా? అని ప్రశ్నించారు. గతంలో ఏబీసీడీ వర్గీకరణ జరిగినప్పుడు పంబాల అనే కులం 'అభివృద్ధి చెందిన' కులాల జాబితాలో ఉండేదని తెలిపారు. ఇప్పుడు ఆ కులాన్ని అత్యంత వెనకబడిన కులాల జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. మన్నె అనే కులంలో 29వేల మంది ఉన్నారని, అభివృద్ధి చెందిన మన్నె కులాన్ని అత్యంత దయనీయ కులాల జాబితాలో ఎలా చేరుస్తారని నిలదీశారు. అత్యంత వెనకబడిన కులాల జాబితాలో అభివృద్ధి చెందిన కులాలను చేర్చి, రిజర్వేషన్లను దోచుకోవాలనే కుట్ర దాగున్నదని ఆరోపించారు.

మాలల ప్రాతినిధ్యం పెంపునకు వివేక్ కుట్ర

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోలేమని గ్రహించి చివరి ప్రయత్నంగా మాలల ప్రాతినిధ్యం పెరగాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే తమకు 11 శాతం కల్పించాల్సిన రిజర్వేషన్లను 9 శాతానికి తగ్గించారని తెలిపారు. ఇప్పటికైనా లోపాలను సవరించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. షమీం అక్తర్ వ్యక్తిగతంగా క్రీమీలేయర్ ఉండాలని సూచించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే వివేక్ గతంలో మాదిగ, మాలలతోపాటు నేతకాని కులానికి కార్పొరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు నేతకానిలకు వర్గీకరణలో వాటా కావాలని ఎందుకు కోరలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ నివేదిక తయారు చేసినప్పుడే కుట్రపై కసరత్తు జరిగినట్టుగా ఉన్నదని చెప్పారు. ఈ కసరత్తులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర నరసింహ, కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ భాగస్వామ్యులు అని ఆరోపించారు. దామోదర మౌనం, చేతగానితనం వల్లే మాదిగల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయనను క్యాబినెట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆయన స్థానంలో మరో ఇద్దరు మాదిగలకు మంత్రులుగా అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తంచేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను మోసం చేసింది

- మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య ఆగ్రహం

కవాడిగూడ, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మాల సంఘాల జేఏసీ నేతలు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని వ్యతిరేకిస్తూ జేఏసీ చైర్మన్ చెన్నయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటుచేసుకుంది. చెన్నయ్య మాట్లాడుతూ మాలలను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోని మాల ప్రజాప్రతినిధులు పార్టీ నుంచి బయటకు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు గుడ్ల కొరత!

- సరఫరాలో మాయాజాలం.. పౌష్టికాహారం ప్రశ్నార్థకం
- బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అందని పౌష్టికాహారం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల చేతివాటంతో రాష్ట్రంలోని పలు అంగన్‌వాడీలకు అందాల్సిన గుడ్లు నెలలో సగం రోజులు మాత్రమే అందుతున్నాయి. దీంతో కేంద్రాలలో నమోదు చేసుకున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. ఈ విషయంపై అంగన్‌వాడీ టీచర్లు సైతం బహిరంగంగానే పెదవి విరిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సకాలంలో అంగన్‌వాడీలకు గుడ్లు సరఫరా చేయని కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఇచ్చిన నోటీసులకు వివరణ కూడా రావడం లేదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారులు మాత్రం గుడ్ల సరఫరాలో లోపాలు లేవని వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో మంత్రి సీతక్క పలుమార్లు కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితులు ఇలాగే ఉంటే కాంట్రాక్టర్లపైన తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రతినెల గుడ్ల సరఫరాకు రూ.15 కోట్లు..

రాష్ట్రంలో మొత్తం 35,700 అంగన్‌వాడీలు ఉండగా.. వాటిలో ప్రతి నెలా సగటున 3 కోట్ల గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకు ప్రతినెలా సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇలా ప్రతిఏటా బడ్జెట్‌లో కేవలం బాలింతలు, గర్భిణులు, పిల్లలకు దాదాపు రూ.180 కోట్లు కేటాయిస్తున్నారు. కానీ, అధికారులు, కాంట్రాక్టర్ల మాయాజాలంతో గుడ్ల పేరుతో నిధులు దారి మళ్లిస్తున్నట్లు కొందరు అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు నిర్మల డిమాండ్ చేస్తున్నారు.

సరఫరా చేసిన వాటికే బిల్లులు రాలేదు..

ఇదిలా ఉంటే టెండర్ల ప్రకారం రెండేండ్ల నుంచి గుడ్లు సరఫరా చేస్తున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా సరఫరా చేసిన గుడకు బిల్లులు రాలేదని పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో మాత్రం ఏడాదిగా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. దీంతో వర్కర్లు, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపి తమకు సకాలంలో బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు 345 కోట్ల అప్పు

- 13 నెలల్లోనే రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన అప్పు అక్షరాలా 1,46,917 కోట్లు
- ఆర్బీఐ నుంచి 3,000 కోట్ల కొత్త రుణం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై అప్పుల భారం రోజురోజుకు పెరిగిపోతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే అక్షరాలా రూ.1,46,918 కోట్ల అప్పు చేసింది. అంటే రోజుకు రూ.345 కోట్ల అప్పు తీసుకొచ్చి సర్కారు పాలన సాగిస్తున్నది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి మంగళవారం మరో రూ.3,000 కోట్ల రుణాన్ని సమీకరించింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ 31 వరకు ఒక్క ఆర్బీఐ నుంచే రూ.56,027 కోట్లు సమీకరించారు. జనవరిలో రెండు దఫాలుగా రూ.5,800 కోట్లు, ఈ నెల 4న మరో రూ.3,000 కోట్లు రుణం పొందింది. మొత్తం కలిపితే రూ.64,827 కోట్లు. ఆర్బీఐ ప్రతి మంగళవారం నిర్వహించే ఈ-వేలం ద్వారా సమీకరించిన మొత్తం రుణం అక్షరాలా రూ.64,827 కోట్లు. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండా, ఒక్క ప్రతిష్టాత్మక పథకం పూర్తిగా అమలు చేయకుండా.. ఈ స్థాయిలో అప్పులు చేయడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు

కేంద్రప్రభుత్వం విధించిన ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటి రాష్ట్ర సర్కారు రుణ సమీకరణ చేస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని రూ.49,255 కోట్లకు విధించగా.. ఇప్పటికే రేవంత్‌రెడ్డి సర్కారు మూడు త్రైమాసికాల్లో (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) తీసుకున్న రుణం రూ.41,759 కోట్లకు చేరింది. కేంద్రం అనుమతించిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో మిగిలిన రూ.7,500 కోట్ల రుణాలు ప్రస్తుత చివరి త్రైమాసికంలో (జనవరి, ఫిబ్రవరి, మార్చిలో) తీసుకొనే అవకాశం ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చివరి త్రైమాసికంలో ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు (నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున) తీసుకుంటామని ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత అదనపు రుణం ఇచ్చేందుకు కేంద్రం నిరాకరించింది. ఆర్బీఐ జనవరిలో రూ.5,800 కోట్లు, 4న మరో రూ.3,000 కోట్లు ఇచ్చింది. ఈ నెలలో మిగిలిన మూడు వారాలతోపాటు వచ్చే నెలలో ఎంత మేరకు రుణం ఇస్తుందో చూడాల్సి ఉన్నది.

రేవంత్‌రెడ్డి సర్కారు సమీకరించిన అప్పులు ఇలా..

13 నెలల్లో ఒక్క ఆర్బీఐ నుంచి బహిరంగ వేలంలో పాల్గొని రేవంత్‌రెడ్డి సర్కారు ఇప్పటివరకు రూ.64,827 కోట్ల రుణం సమీకరించింది. కార్పొరేషన్లు/ఎస్‌పీవీల నుంచి ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా రూ.61,991 కోట్లు అప్పు తీసుకున్నది. ఎలాంటి గ్యారెంటీ ఇవ్వకుండా సర్కారు మరో రూ.10,099 కోట్ల రుణాలు సేకరించింది. టీజీఐఐసీ ద్వారా ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.10 వేల కోట్ల పొందింది. ఇలా మొత్తం రూ.1,46,917 కోట్లు సేకరించింది.

గృహ విద్యుత్తు వినియోగదారులకు షాక్!

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్ పరిధిలో దాదాపు 10 లక్షల మంది విద్యుత్తు వినియోగదారులపై తీవ్ర భారం పడటం ఖాయం. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారిపై ఈ ప్రభావం అధికంగా ఉంటుంది. ఎందుకంటే.. ఆ భవనాల్లో కొన్ని ఫ్లోర్లకే అనుమతులుంటాయి. ఇకపై ఆ అంతస్తుల్లోని విద్యుత్తు కనెక్షన్లనే డొమెస్టిక్ క్యాటగిరీలో కొనసాగించి డిస్కమ్ నిర్ణయించిన స్లాబ్ ప్రకారం బిల్లింగ్ చేస్తారు. దీంతో ఆయా ఇండ్లలోని 80% మంది వినియోగదారులకు 300 యూనిట్లలోపు స్లాబ్ వల్ల రూ.వెయ్యి న